క్లుప్తంగా

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలి



కొనుగోళ్లు పరిశీలిస్తున్న ఐకేపీ అధికారులు

ముస్తాబాద్: ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని సీసీ శోభన్‌బాబు కోరారు. మొర్రాపూర్ తండాలో కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ధాన్యం సేకరణకు కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. గన్నీ సంచుల కొరత లేదన్నారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. తేమ శాతం లేకుండా రైతులు చూసుకోవాలని, సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నామన్నారు. ఐకేపీ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల గృహ సందర్శన



కేసీఆర్‌నగర్ వాసులతో విద్యార్థినులు

తంగళ్లపల్లి: ప్రాజెక్ట్ రిపోర్టులో భాగంగా మండలంలోని మండెపల్లి కేసీఆర్‌నగర్ డబుల్ బెడ్రూం సముదాయంలో శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినుల బృందం పర్యటించింది. 1,320 గృహాల సముదాయంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసులకు వైద్యపరమైన సలహాలు, సూచనలు చేశారు. నర్సింగ్ విద్యార్థినులు మాట్లాడుతూ సైన్స్ ఎంతో పురోగతి సాధించిన ఈ కాలంలో మూఢనమ్మకాలను నమ్మవద్దని తెలిపారు. ప్రతి ఇంటిలో పిల్లలను బడికి పంపాలని చదువుతోనే వారి భవిష్యత్ బంగారుమయం అవుతుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు పున్నం చందర్, మండెపల్లి సర్పంచ్ గణప శివజ్యోతి, ఎంపీటీసీ బుస్స స్వప్న, నాయకులు మదన్‌రెడ్డి, లింగం, కట్ట రవికుమార్, కొత్త సంతోష్, శేఖర్, మహేశ్, నరేశ్, గణేశ్, నాగనాథ్ పాల్గొన్నారు.

'బేటి పడావో.. బేటి బచావో'



అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం 'బేటి పడావో.. బేటి బచావో'లో భాగంగా మాత శిశు సంరక్షణ కోఆర్డినేటర్లు రోజా, సంతోషి, వసుధ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ టోల్ ఫ్రీ నంబర్లు, 1098, 100, 108, 181 లను వివరించి ఏఏ సందర్భాల్లో ఉపయోగించాలో వివరించారు. బాల్యవివాహాలు, పిల్లలను పనిలో పెట్టడం వంటి వాటిని అరికట్టాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.ఆరాధన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిత్రకథ



రోడ్డు పక్కనే గుంత

బోయినపల్లి: బోయినపల్లి నుంచి కోరెం, మీదుగా అనంతపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డులో బోయినపల్లి-బూర్గుపల్లి చౌరస్తా మూల వద్ద రోడ్డు పక్కన పెద్ద గుంత పడింది. రాత్రిపూట ఎదురుగా వాహనం వస్తే రోడ్డు దిగితే వాహనదారులు గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వెంటనే గుంత పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



చీరలే రక్షణగా..


కోనరావుపేట: మండలంలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పరదాలు కరువయ్యాయి. సెంటర్ల నిర్వాహకులు టార్పాలిన్ సరఫరా చేయకపోవడంతో రైతులే పరదాలను ఏర్పాటు చేసుకోవాల్సి వస్తుంది. చీరలను పరదాలుగా కుట్టి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వినియోగిస్తున్నారు.

సందట్లో సడేమియా?

- ఎన్నికల హడావుడిలో అధికారులు
- విలీన గ్రామాల్లో జోరందుకున్న అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని పాలకులు



వేములవాడరూరల్: పై ఫొటోలో కనిపిస్తున్న నిర్మాణం వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన ఒక వార్డులో జరుగుతోంది. గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అనుమతులు తీసుకున్న యజమాని ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేసుకుంటున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయం.. ఎవరు పట్టించుకోరన్న ధీమాతో ఎవరికి తోచిన విధంగా నిర్మాణాలు చేసుకుంటునే ఉన్నారు. ఇది ఒక వార్డులోనే కాదు చాలా వార్డుల్లో ఇలాంటి పరిస్థితే ఉంది.



వేములవాడ పట్టణం

వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ఇష్టారాజ్యంగా ఎలాంటి అనుమతులు లేకుండా కొంతమంది నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల హడావుడిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండడంతో ఇదే అదనుగా భావించిన కొంతమంది గృహ యజమానులు అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నట్లు పలువురు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లి, అయ్యోరుపల్లి, తిప్పాపూర్, నాంపల్లి, కోనాయపల్లి గ్రామాలు కలవు. ఈ గ్రామాలు గతంలో గ్రామ పంచాయతీలుగా ఉండేవి. ప్రస్తుతం మున్సిపాలిటీలో విలీనం కావడంతో ఆ గ్రామాలు కౌన్సిలర్ల పరిధిలో నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి అనుమతులు లేకుండా కొంతమంది ప్రజాప్రతినిధులు, గృహ యజమానులు నిర్మాణాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మరికొన్ని గృహాలకు గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో అనుమతులు తీసుకుని వాటితోనే ప్రస్తుతం నిర్మాణాలు చేపడుతున్నట్లు కూడా పలు ఆరోపిస్తున్నారు.

చూసీచూడనట్లు అధికారులు

విలీన గ్రామాల్లో కొంతమంది కౌన్సిలర్లు అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. మరికొన్ని నెలల్లో మున్సిపాలిటీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో తన రాజకీయ భవిష్యత్‌ను కాపాడుకునేందుకు కొంతమంది పాలకులు ఈ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం లేదని ఆ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. కొన్ని వార్డుల్లో కొంతమంది ప్రజాప్రతినిధులు అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేస్తూ గృహ యజమానుల నుంచి ముడుపులు దండుకుని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నట్లు కూడా పలువురు వార్డు ప్రజలు ఆరోపిస్తున్నారు.

హైకోర్టు స్టేతో నిర్మాణం



13వ వార్డులో ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగడం లేదు. అనుమతి లేకుండా నిర్మాణం చేసుకున్న వారికి ఇప్పటికే మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు. కొందరు హైకోర్టు స్టేతో నిర్మాణాలు చేసుకుంటున్నారు. అనుమతులు లేకుండా ఎవరూ నిర్మాణాలు చేపట్టడం లేదు. మా వార్డులో అవకతవకలకు తావు లేదు.

– గడ్డమీది లావణ్య, 13వ వార్డు కౌన్సిలర్, వేములవాడ

నోటీసులు ఇచ్చాం



విలీన గ్రామాల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. వారిని గుర్తించి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎవరూ కానీ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులు ఉంటేనే నిర్మాణాలు చేసుకోవాలి.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

దీపావళి వేడుకలు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో శుక్రవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దీపాలు వెలిగించి టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. సర్కార్ బడిలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి మొదటిసారి పండుగ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుబేర స్వామి, ఉపాధ్యాయులు ఉదయలక్ష్మి, అంజనేయులు, శోభారాణి, అరుంధతి పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



రోడ్డు పక్కనే బావి

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులో వీర్నపల్లికి వెళ్లే రహదారిలో రోడ్డుపైనే పాతబావి ప్రమాదకరంగా ఉంది. ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వచ్చి వెళ్తుంటాయి. బావి వద్ద వరుసగా ప్రమాదాలు జరుగుతుండగా బావి పూడ్చివేసేందుకు ఉపాధిహామీలో నిధులు మంజూరైనా, అధికారులు పట్టించుకోవడం లేదు. కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైనా బావిని పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: కిరణ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, ఎల్లారెడ్డిపేట
సెల్ నెంబర్: 94408 18864

చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఎన్నికల పరిశీలకులు



ఫాజుల్‌నగర్ చెక్‌పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారులు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండస్వామి శుక్రవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఎన్నికల సందర్భంగా డబ్బులను తరలించే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా అధికారులు ఉన్నారు.

అయ్యప్పస్వామి ఆలయానికి రూ.82,116 విరాళం



విరాళం అందిస్తున్న యాళ్ల మధుసూధన్ రెడ్డి

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయానికి జవారిపేట గ్రామానికి చెందిన యాళ్ల మధుసూధన్ రెడ్డి అతడి తండ్రి యాళ్ల బక్కారెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం రూ.82,116 విరాళం అందజేశారు. ఇట్టి మొత్తాన్ని ఆలయంలో గ్రానైట్ ఏర్పాటు చేసేందుకు వినియోగించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న రెడ్డి సంఘ సభ్యులు

గంభీరావుపేట: మండల కేంద్రంలో రెడ్డి సేవా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ముత్యాల రాజిరెడ్డి, మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు గడ్డమీది శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు లక్కిరెడ్డి కమలాకర్‌రెడ్డి, ఎంపీటీసీ కోటయ్యగారి రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యాధి నిర్ధారణ పరీక్షలు



షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చొప్పదండి: మండలంలోని కోనేరుపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మంకమ్మతోట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో షుగర్ టెస్టులు నిర్వహించి వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెన్నమాధవుని పవనసుత రాజు, బొంగోని దామోదర్, మేచినేని రాజేశ్వర్‌రావు, శంకరయ్య, ఉపసర్పంచ్ కాసు వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

గంగాధర: పోలీసులు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా ఉండాలని ఎస్సై పుల్ల అభిలాష్ కానిస్టేబుల్‌గా ఎంపికైనవారికి సూచించారు. మండలంలో 34 మంది ఉద్యోగానికి ఎంపిక కాగా శుక్రవారం వారి సర్టిఫికెట్లు పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చట్టాల అమలు, నేరా లను నియంత్రించడం, అత్యవసర పరిస్థితుల్లో ప్రతిస్పందించడం, సహాయక సేవలు అందించే లక్షణాలు ఉండాలన్నారు. ప్రజలు, వారి ఆస్తులు రక్షించడం, చట్టాలను ఉల్లంఘించిన వారిని పట్టుకోవడంలో బాధ్యత ఉండాలన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం సంకెపల్లి, రుద్రవరం ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పండుగ నరసింహాస్వామి, ఉపాధ్యక్షుడు రంగు శ్రీనివాస్, కోశాధికారి వంకాయల కనుకయ్యను ఎన్నుకున్నట్లు తెలిపారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తంగళ్లపల్లి: పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ బీపీఎంలు ప్రసన్న, అనుపమ, మౌనిక అవగాహన కల్పించారు. మండలంలోని మండెపల్లి గ్రామంలో శుక్రవారం తపాలా శాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టల్ ఇన్సూరెన్స్ మేళాలో వారు మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన వారి నుంచి 60 ఏళ్ల వయస్సు లోపు వారికి రెండు రకాల ఇన్సూరెన్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రూ.399తో రూ.10 లక్షల బీమా సదుపాయం ఏడాదిపాటు ఉంటుందన్నారు. హెల్త్ ఇన్సూరెన్స్, ఎక్స్‌ప్రెస్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గణప శివజ్యోతి, ఉపసర్పంచ్ నాగరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



మండెపల్లిలో పోస్టల్ ఇన్సూరెన్స్ మేళా

బోయినపల్లి: మండలంలోని తడగొండ ఎస్సీ కాలనీలో పోస్టల్ పథకాలపై శుక్రవారం బీపీఎంలు కట్ట కిరణ్, చిందం శశి అవగాహన కల్పించారు. టాటా ఇన్సురెన్స్ గార్డ్ పాలసీ తదితర పథకాల గూర్చి ప్రజలకు తెలియచెప్పారు.

వ్యవసాయ రంగాన్ని వ్యాపారంగా మల్చుకోవాలి

కోనరావుపేట: వ్యవసాయ రంగాన్ని వ్యాపారంగా మలుచుకున్నప్పుడే రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్ కే మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో వ్యవసాయ సంబంధిత, అనుబంధ రంగాలపై ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అలాగే సాంకేతిక మద్దతు, అందుబాటులో ఉన్న వివిధ మార్కెట్లలో మార్కెటింగ్ మద్దతుతో సహా, నిర్మాణాత్మక సంస్కరణల ద్వారా రైతు ఉత్పత్తిదారులను బలోపేతం చేయవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై, అన్నదాత సురక్ష, బీమా పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మామిడిపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ సీఈవో వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సేఫ్స్ ఎన్జీవో ప్రతినిధులు కృష్ణ, సాయివంశీ, రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏరువాక కేంద్ర బృందం

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



న్యూట్రిషియన్ కిట్లను అందజేస్తున్న వైద్యాధికారి

ముస్తాబాద్: ప్రభుత్వం గర్భిణులకు అందించే న్యూట్రిషియన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి బత్తుల గీతాంజలి కోరారు. ముస్తాబాద్ మండలం పోతుగల్ పీహెచ్‌సీలో గర్భిణులకు న్యూట్రిషియన్ కిట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ న్యూట్రిషియన్ కిట్లలో నెయ్యి, ఖర్జుర, చిక్కి, ఆల్బెండజోల్, ఐరన్ సిరప్స్, మదర్ హార్లిక్స్‌ను అందజేస్తామన్నారు. నవజాత శిశువులు ఆరోగ్యంగా ఉండేందుకు కిట్లు ఉపయోగపడుతాయన్నారు. ప్రతినెల గర్భిణులను ఆరోగ్య కేంద్రానికి తీసుకురావాలని, వారికి వైద్య పరీక్షలు నిర్వహించి, న్యూట్రిషియన్ కిట్లను అందజేస్తామన్నారు. సుఖ ప్రసవాలకు, ఆరోగ్యకరంగా శిశువులు జన్మించేందుకు కిట్లను ఉపయోగించాలన్నారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధించి, ఆరోగ్యకరమైన సమాజం ఏర్పాటు అవుతుందన్నారు. హెచ్‌ఈవో యాదగిరి, సిబ్బంది రమ్య, ఏఎన్‌ఎమ్‌లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో మిల్లర్ల ధాన్యం

- ధాన్యానికి స్థలం లేక రైతుల అవస్థలు



నిల్వ ఉన్న మిల్లర్ల ధాన్యం

రుద్రంగి: స్థానిక మార్కెట్ యార్డులో రైతులు ధాన్యం పోసేందుకు, ఆరబెట్టేందుకు స్థలం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, మార్కెట్ యార్డు సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. మార్కెట్ యార్డు షెడ్లలో నిల్వ ఉంచిన ప్రయివేటు రైస్ మిల్లర్ల ధాన్యం తీసి, రైతులకు స్థలం కేటాయించాల్సి ఉండగా, కొనుగోళ్ల సమయంలో మిల్లర్ల ధాన్యం తరలించేందుకు చర్యలు తీసుకోకపోవడంతో సమస్య తలెత్తుతోంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోని రైతులకు ధాన్యం పోసుకునేందుకు స్థల కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

టపాసుల వ్యాపారులు అనుమతులు తీసుకోవాలి

ఎల్లారెడ్డిపేట: దీపావళి పండుగ సందర్భంగా టపాకాయల దుకాణాలు నిర్వహించే వ్యాపారులు తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని ఎస్సై రమాకాంత్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో టపాకాయల నిర్వాహకులతో శుక్రవారం మాట్లాడారు. జనావాసాలకు దూరంగా బహిరంగ ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. షాపుకు, షాపుకు మధ్య దూరం ఉండేలా చూడాలన్నారు. అగ్ని ప్రమాదాలు నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మంటలను ఆర్పేందుకు వాటర్, ఫైర్‌క్యూసర్, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే షాపు యజమానులే బాధ్యులన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే దుకాణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.